క్లుప్తంగా

బీసీ ఎజెండా కోసం ఉద్యమించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

కోటపల్లి: జిల్లాలోని బీసీ వర్గ ప్రజల ఆకాంక్ష కోసం ఐక్యంగా ఉద్యమించాలని బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ అన్నారు. మండలంలోని బోరంపల్లి, దేవులవాడ, కొల్లూర్, రాంపూర్, లక్ష్మీపూర్, బబ్బరిచెల్క, వెలమపల్లి, ఆన్నారం, రాపన్‌పల్లిలో బుధవారం ప్రజాచైతన్య యాత్ర నిర్వహించి సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ గణన చేపట్టేలా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నారన్నారు. జిల్లాలోని బీసీ వర్గాలు ఐక్యంగా ఉద్యమించి బీసీ జనగణనను చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్‌ను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మండల్ కమిషన్ సిఫార్సులు పూర్తిగా అమలు చేసి బీసీల సంక్షేమానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా నాయకులు నీరటి రాజన్న, సోమయ్య, వెంకటేశ్, అంజయ్య, రాజసమ్ములు, రాజగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చెన్నూర్: పూలే, అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో పూలే, అంబేడ్కర్ జనజాతర కార్యక్రమంలో భాగంగా పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే, అంబేడ్కర్ కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చందు, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ దూర్కె మోహన్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో నాయకులు

నస్పూర్: కార్మికులకు అనేక హక్కులు సాధించిన ఘనత తమదేనని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఆర్‌పీ 1 గనిపై బుధవారం ఆయన ఐఎన్‌టీయూసీ సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా నాయకులు కార్మికుల నుంచి సభ్యత్వాన్ని స్వీకరించి రశీదు అందించారు. కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, కేంద్ర కమిటీ నాయకులు గరిగె శ్యామ్, పిట్ సెక్రటరీ రావుల అనిల్, నాయకులు పెట్టెం శ్రీనివాస్, ఎం వెంకటేశ్, పి శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సరోజ

లక్సెట్టిపేట: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో సరోజ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గ్రామ కార్యదర్శులు తాగు నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని సూచించారు. ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని, పనులు నిర్వహించే ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించాలని తెలిపారు. అనంతరం సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటరమణ, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన మహమ్మాయి ఉత్సవాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్, ఆస్నాద, పొక్కూరు, దుగ్నెపల్లి, ముత్తరావుపల్లి, అంగ్రాజ్‌పల్లి, సుద్దాల, కిష్టంపేట గ్రామాల్లో ఉగాదికి ముందు రోజైన సోమవారం ప్రారంభమైన మహమ్మాయి అమ్మవారి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. మహిళలు, మంగళహారతులతో ఇంటింటికీ వెళ్లి అమ్మవారికి పూజలు చేసి ఉద్వాసన పలికి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు ఉత్సవాలను ముగించారు.

భగీరథ.. నీరంతా వృథా..!

- పైపులైన్ లీకేజీలతో రోడ్లపై పారుతున్న నీరు



బెల్లంపల్లి: రోడుపక్కన గుంతలో నిండిన నీరు

బెల్లంపల్లి: వేసవి తీవ్రతతో ఓ పక్క నీటి కోసం ప్రజలు అల్లాడుతుంటే, మరోపక్క మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలు జరిగి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 19వార్డు బెల్లంపల్లి బస్తీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏరియాలో అంతర్గతంగా ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి కొన్ని రోజుల నుంచి నీరు రోడ్డుపై వృథాగా ప్రవహిస్తోంది. మిషన్‌భగీరథ నీటి సరఫరా చేసిన ప్రతిసారి ఇలాగే నీరు రోడ్డు పాలవుతోంది. వరదలా నీరు రోడ్డుపై పారుతుండటంతో వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా ఉంటోంది. తద్వారా నల్లా కలెక్షన్ తీసుకున్న ఇళ్లకు నీటి సరఫరాలో ప్రెషర్‌లేకుండా పోతోందనే విమర్శలు ఉన్నాయి. పైపులైన్ లీకేజీని గుర్తించి మరమ్మతు చేయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని అధికారుల తీరుపై బస్తీ వాసులు ఆగ్రహం చెందుతున్నారు. నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు కనీస శ్రద్ధ పెట్టడం లేదు. నిర్లక్ష్యాన్ని వీడి నీరు దుబారా కాకుండా ఇప్పటికైనా సత్వర చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

భీమారం: మండల కేంద్రంలోని హైస్కూల్ సమీపంలో మిషన్‌భగీరథ పైపులైను పగిలి నీళ్లు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. అసలేవేసవి కాలం నీళ్ల కోసం నానా ఇబ్బందులు పడుతున్న ఈ పరిస్థితుల్లో, మిషన్‌భగీరథ నీటి పైపు పగిలి ఆ నీళ్లు రోడ్డు ఎక్కుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా స్కూల్ వద్ద పైపు నుంచి వృథాగా నీళ్లు పోతున్నాయని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకొని పగిలిన పైపులైనుకి మరమ్మతు చేసి వృథాని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దండేపల్లి: మండుతున్న ఎండలకు బోర్లు, బావులు, ప్రాజెక్టుల్లో నీళ్లు అడుగంటిపోతున్నాయి. ఈ సమయంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయకూడదని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. కానీ దండేపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గల భగీరథ నల్లాకు ఆన్ ఆఫ్ లేదు. దీంతో నీటిని విడుదల చేసినప్పుడల్లా నీరంతా వృథాగా పోతుంది. నీటి పొదుపును గురించి ప్రజలకు తెలియజేసే అధికారులే తమ కళ్ల ముందు నీటి వృథాను అరికట్టడం లేదని పలువురు మాట్లాడుకుంటున్నారు.



భీమారం హైస్కూల్ వద్ద రోడ్డుపై పారుతూ...



దండేపల్లి తహసీల్ కార్యాలయం వద్ద...



రోడ్డుపై వరదలా పారుతున్న భగీరథ నీరు

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి



గొల్లపల్లి కల్వర్టును పరిశీలిస్తున్న సీఐ

నెన్నెల: పార్లమెంట్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలోద్దీన్ కోరారు. గొల్లపల్లి, మైలారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం కేంద్ర బలగాలతో కలిసి పరిశీలించి అక్కడి ప్రజలకు ఎన్నికల నియమ నిబంధనలు వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక శక్తులను ప్రోత్సహించవద్దని, మావోయిస్టులకు సహకరించవద్దన్నారు. గంజాయి, గుట్కా, నాటుసారాలాంటి ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు వెంట ఉన్న కల్వర్టులను తనిఖీ చేశారు. సీఐ వెంట హెడ్ కానిస్టేబుల్ విజయ్, సిబ్బంది కృష్ణ, అనంత్, సంతోష్ ఉన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం..!



సుంకరిపల్లిలో బోరుబావి వద్ద అధికారులు

- బోరుబావిని సందర్శించిన అధికారులు
- మోటారు బిగింపు, మిషన్ భగీరథ నీటి విడుదల

సాక్షి ఎఫెక్ట్..



మిషన్ భగీరథ నీటిని పట్టుకుంటున్న మహిళలు

భీమారం: 'నీటి కోసం పాట్లు' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితం అయిన కథనానికి అధికారులు స్పందించారు. సుంకరిపల్లిని సందర్శించి నీటి సమస్య పరిష్కారం విషయంలో స్థానికులతో మాట్లాడారు. ఈ మేరకు ఉన్న బోరుబావిలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో తాత్కాలికంగా ఉన్న కొంత నీటిని వినియోగించేలా బోరుకి కొత్త మోటారుని బిగించారు. ప్రస్తుతం కొత్త బోరు నిర్మించలేకపోతున్నామని ఎంపీవో సతీష్‌రెడ్డి తెలిపారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా మిషన్‌భగీరథ పైపులైన్ మరమ్మతులు చేసి సుంకరిపల్లికి నీటిని సరఫరా చేశారు. దీంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. నీటి సమస్య పరిష్కరించేందుకు సందర్శించిన వారిలో ఎంపీవో సతీష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి వేముల శ్రీనివాస్ ఉన్నారు.

ఆదివాసీ గ్రామాల భూ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని ఆదివాసీ గ్రామాల భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ బోజన్నకు వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీ ప్రాంతంలోని భూములు ఆక్రమణకు గురవుతున్నందునా తక్షణమే చర్యలు తీసుకొని అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఆదివాసీ గ్రామాలను భూమి, విరాసత్, మిస్సింగ్ సర్వే నంబర్ సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ ప్రాంతంలో 1/17 చట్టాన్ని, వివిధ చట్టాలను అమలు చేయాలని, ఏజెన్సీలో రెండు అంతస్తుల భవనాలు, అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. ఆదివాసీలందరికీ కులం సర్టిఫికెట్ ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలన్నారు. లేనియెడల తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళనలు చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడ జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పేంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, తుడుందెబ్బ మండల గౌరవ అధ్యక్షుడు ఆత్రం జంగు, మండల అధ్యక్షుడు భూమయ్య, కుర్సింగ తిరుపతి, మహేష్, అచ్చుత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడం కర్తవ్యంగా భావించాలి



నోట్ పుస్తకాలు అందిస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: ప్రతి ఒక్కరూ తోచిన రీతిలో మరొకరికి సేవ చేయడం కర్తవ్యంగా భావించాలని బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ అన్నారు. సింగరేణి కళావేదికలో బుధవారం నిర్వహించిన అమ్మఒడి స్వచ్ఛంద సేవా సంస్థ బెల్లంపల్లి ప్రాజెక్టు నాలుగో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో బ్రతుకు దెరువు కోసం వచ్చే కూలీలకు, యాచకులకు, నిరుపేదల ఆకలి తీర్చడానికి అమ్మ ఒడి సంస్థ నాలుగేళ్ల నుంచి అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో అమ్మఒడి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు అజ్మీర మోహన్, బెల్లంపల్లి బ్రాంచ్ మేనేజర్ హన్మాండ్ల మధు, రిటైర్డు హెచ్‌ఎం రమేష్, సభ్యులు లెంకల శ్రావణ్, రంగ సురేష్, ఎండీ.రెహానా, జంజర్ల దినేష్, హన్మాండ్ల పోచయ్య, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'కాకా కుటుంబాన్ని విమర్శించే హక్కు లేదు'



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

జైపూర్: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌కు లేదని, వారి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని జై భీమ్ సైనిక్ దళ్ చెన్నూర్ నియోజక వర్గ అధ్యక్షుడు శీలం వెంకటేశ్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో జైపూర్ మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, నాయకులు జనంపల్లి భానేశ్, బొజ్జ మల్లేశ్, పరమేశ్వేర్, తదితరులు పాల్గొన్నారు.

'బహిరంగ క్షమాపణ చెప్పాలి'

పాతమంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, అతడి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు హరికృష్ణ, శ్రీనివాస్,రాజమల్లు, నాగబాబు, లింగమూర్తి, తాజ్‌బాబా, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పిన్నారం ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

కోటపల్లి: పిన్నారం గ్రామపంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఎంపీడీవో భూమన్నకు వినతిపత్రం అందజేశారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఇప్ప దుర్గయ్య ఉపాధి హామీ పనులకు హాజరుకాని తన బంధువులకు మాస్టర్ వేస్తున్నారని, ఇదే విషయాన్ని గ్రామస్తులు అడిగితే సరైన సమాధానం చెప్పక ఇష్టరీతిన వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో హైదర్, సమ్మయ్య, చందు, సంపత్, రాజేశ్, బానేశ్, తిరుపతి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విద్యాసాగర్

భీమారం: స్థానిక బస్టాండ్ వద్ద ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు గ్రామపంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు విద్యాసాగర్ ప్రారంభించారు. ఎంపీవో సతీష్‌రెడ్డి, కార్యదర్శి వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్ పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని వాటి సాధన దిశగా అడుగులు వేయాలని మంచిర్యాల షీ టీమ్ ఎస్సై హైమ, తాళ్లగురిజాల ఏఎస్సై రాజన్న అన్నారు. బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ బాలుర గురుకుల విద్యాలయంలో బుధవారం షీ టీమ్ పని తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, అరుణ్‌కుమార్, అబ్దుల్, సతీష్, శ్రావణ్, జ్యోతి, గురుకుల విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



దౌడపల్లిలో పనులు పరిశీలిస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మండలంలోని దౌడపల్లి గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో పరిశీలించారు. కనీస సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను కల్పించాలని, పెండింగ్ బిల్లులను అందించాలని లేనిచో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మేదరి దేవవరం, రమణారెడ్డి, దేవన్న, రామన్న పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు.

రికార్డులు అప్పగించాలి

మందమర్రిరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన అభివృద్ధి పనుల రికార్డులను గురువారం వరకు సామాజిక తనిఖీ బృందానికి అప్పగించాలని ఎంపీడీవో రాజేశ్వర్ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సమావేశంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఈజీఎస్ ఏపీవో, సిబ్బంది ఉన్నారు.

మెరుగైన విద్యాబోధన చేయాలి

తాండూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని మండల మానిటరింగ్ అధికారి మల్లేశం సూచించారు. మండలంలోని కిష్టంపేట పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వేసవి దృష్ట్యా మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. మల్లేశం వెంట ప్రధానోపాధ్యాయుడు మాసాడి శ్రీరాములు, సిబ్బంది ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియా మసీదులో బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు జరిగింది. రేవంతన్న యువ సావదాన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రాళ్లబండి విజయ్‌కుమార్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చి ఆప్యాయతను చాటుకున్నాడు.

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్ బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం 90 కుటుంబాలకు రంజాన్ తోఫాలు అందజేశారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు

లక్సెట్టిపేట: రంజాన్ పండుగ కోసం మండలంలోని మసీదుల వద్ద ముస్లింలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ఏర్పాట్లను పరిశీలించారు. మసీదుల వద్ద ఇబ్బందులు లేకుండా ఉండేందుకు టెంట్, తాగు నీరు, మౌలిక సదుపాయాలను కల్పించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముస్లింలు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జన్నారం/వేమనపల్లి: డీసీఎంఎస్ ఆధ్వర్యంలో జన్నారం మండలకేంద్రంలోని తపాలపూర్, రాంపూర్, సింగరాయి పేట్, బాదంపల్లి, ఇందన్‌పల్లి గ్రామాల్లో, వేమనపల్లి మండల కేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారుల వద్ద అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని ఏ గ్రేడ్ రూ.2,203, బి గ్రేడ్ రూ.2,183 మద్దతు ధర పొందాలన్నారు.

నర్సరీకి నెట్లు ఏర్పాటు

భీమారం: స్థానిక నర్సరీలోని మొక్కలను ఎండల నుంచి రక్షించేందుకు అధికారులు బుధవారం నెట్లు ఏర్పాటు చేశారు. గ్రీన్‌షెడ్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా ఉదయం, సాయంత్రం నీటిని అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎంపీడీవో రాధ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బీఎస్పీలో పలువురి చేరిక

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన పలువురు బుధవారం బీఎస్పీలో చేరారు. స్థానికం బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కట్ట పవన్ కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కాదాశి రవీందర్, జిల్లా ఇన్‌చార్జి సిరికొండ బోస్, జనరల్ సెక్రటరీ రమేష్ చంద్ర, నాయకులు రాజ్‌కుమార్, తిరుపతి తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన కోసం రూ.50వేలు విరాళం

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌లో నూతనంగా శ్రీమడేలయ్య ఆలయం నిర్మించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు బుధవారం రూ.50వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ

కాసిపేట: మండలంలోని పెద్దధర్మారంలో నూతన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమం చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటీ స్వామి, ప్రధాన కార్యదర్శి రమేష్, సంకూరి శ్రీనివాస్, రవికుమార్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

హన్మాన్ భక్తుల మాలధారణ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం పలువురు భక్తులు హనుమాన్ దీక్ష మాలలు ధరించారు. 11రోజుల హనుమాన్ దీక్షకు సంబంధించి సుమారు 400 మంది మాలలు ధరించినట్లు అర్చకులు తెలిపారు.

విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: ఈ నెల 14న నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని బుధవారం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

సరుకులు పంపిణీ

మందమర్రిరూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీనివాస్–రాణి దంపతులు వారి కుమారుడు విశాల్ పేరిట బుధవారం పలువురు ముస్లిం మహిళలకు చక్కెర, బియ్యం, సేమియా, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సెల్ఫ్ డిఫెన్స్ హెల్త్ డిఫెన్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కలీమ్ పలు ముస్లిం కుటుంబాలకు సరుకులతో పాటు రూ.500 అందజేశారు.